ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఉష్ణోగ్రత : గరిష్ఠం 39.0 కనిష్ఠం 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (సోమవారం సాయంత్రం)
సహర్: 5:00 (మంగళవారం ఉదయం)

దారంతా పసుపు వర్ణం

రోడ్లు పూలవనాలయ్యాయి. ఘట్‌కేసర్ నుంచి కీసర వెళ్లే ఔటర్ సర్వీసు రోడ్లకు ఇరువైపులా చెట్లు పసుపువర్ణం పూలతో వాహనదారులను కట్టిపడేస్తున్నాయి. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఈ పూల చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఎండలకు మెరిసిపోతూ ఆకట్టుకుంటున్నాయి. అలాగే ఘట్‌కేసర్ నుంచి కీసర వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులోనూ పలుచోట్ల చెట్లు నిండుగా పసుపు రంగు పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

- ఘట్‌కేసర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి)



సన్‌డే

దంచికొడుతున్న ఎండలు
గరిష్ఠంగా 40.5 డిగ్రీలు నమోదు



వికారాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరుసగా రెండో రోజు ఆదివారం జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు మండలాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటడంతో జనాలు బెంబేలెత్తిపోయారు. అత్యధికంగా పూడూరు మండలం, మన్నెగూడ, బంట్వారం మండలం, తొరమామిడిలో వరుసగా రెండో రోజు 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మర్పల్లి, బంట్వారంలో 40.4 డిగ్రీలు, కోట్‌పల్లి, మోమిన్‌పేట్‌లో 40.2 డిగ్రీలు నమోదయ్యాయి. మదన్‌పల్లిలో 39.9 డిగ్రీలు, ధారూరు, వికారాబాద్‌లో 39.7, నవాబ్‌పేట్‌లో 39.5, బషీరాబాద్, కాశీంపూర్‌లో 39.4, పెద్దేముల్‌లో 38.3, పెద్ద ఉమ్మెంతాల్‌లో 38.2, చౌడాపూర్‌లో 38.1, తాండూరు ఏఆర్ఎస్‌లో 38.0 డిగ్రీలు నమోదయ్యాయి. ముజాహిద్‌పూర్, పుట్టపహడ్, మద్గుల్‌చిట్టంపల్లిలో 37.8, దావలాపూర్, తాండూరు, యాలాల్‌లో 37.7 డిగ్రీలు, దౌల్తాబాద్‌లో 37.3, రాపోల్‌లో 37.2 డిగ్రీలు నమోదయ్యాయి. పరిగిలో 36.7, బొంరాస్‌పేట్, దుద్యాల్‌లో 36.5, దోమ, కొడంగల్‌లో 36.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, జిల్లాలో కోట్‌పల్లిలో కనీస ఉష్ణోగ్రత 19.0 డిగ్రీలు నమోదైంది.

సరిపడా నీళ్లు వదలకుంటే ధర్నా చేస్తా..

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సరిపడా తాగు నీరు సరఫరా చేయకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హెచ్చరించారు. మేడ్చల్ పట్టణంలో రెండు నెలలుగా సమయానికి సరిపడా మంచినీరు సరఫరా కావడం లేదని పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి విన్నవించారు. ఆయన వెంటనే స్పందిస్తూ మేడ్చల్ మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయాలని సూచించారు. నీటి సరఫరాలో ఎలాంటి పక్షపాతం ఉండొద్దన్నారు. కొన్ని వార్డుల్లో గంటపాటు నీటి సరఫరా చేయకపోవటం సరైంది కాదన్నారు. అధికారులు వార్డుల్లో పక్షపాత ధోరణితో నీటి సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. అధికారులు తమ తీరును మార్చుకోని ఎడల మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతానని హెచ్చరించారు.

పోరుకు సన్నద్ధం

నేటి నుంచి అంగన్‌వాడీల ధర్నా
కలెక్టరేట్ ఎదుట వంటావార్పు
ఆరు నెలలుగా బిల్లులు అందక అవస్థలు
ఆర్థిక భారంతో సతమతం
జిల్లాలో 670 కేంద్రాలు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగులు పోరుకు సన్నద్ధమయ్యారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేటి నుంచి ధర్నా, వంటావార్పు చేయనున్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు ఆరు నెలలుగా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కిరాయిలు, కూరగాయల బిల్లులు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ దిక్కు అధికారుల వేధింపులు, మరో వైపు పనిభారంతో సతమతమవుతున్నారు. వేతనాలు సైతం సరైన సమయానికి రాకపోవడంతో ఆర్థికంగా భారం అవుతోందని వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్లు కూడా కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి.



సగానికిపైగా అద్దె భవనాల్లోనే..

జిల్లాలో 670 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో దాదాపు 400 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతావి ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్‌లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు అద్దెలు చెల్లించలేక, కూరగాయల బిల్లుల రాక అంగన్‌వాడీలు ప్రభుత్వానికి, చిన్నారులకు నడుమ కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో 1300 అంగన్‌వాడీలకు గాను దాదాపు 200 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 1,100 మంది విధులు నిర్వహిస్తున్నారు. వారికి అందించే నెల వేతనం రూ.13,600 కూడా నెలనెలా చెల్లించడంలేదు. 2, 3 నెలలకోసారి వేతనాలు చెల్లిస్తున్నారు. అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకు, మంత్రులకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని వాపోతున్నారు.

నేటి నుంచి మహా ధర్నా

అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు, రేపు మహా ధర్నాకు


మిగతా 8వ పేజీలో...

సమస్యలు పరిష్కరించాలి



ఆరు నెలలుగా సమస్యలతో సతమతమౌతున్నాం. బిల్లులు రాక కనీస అవసరాలకు కూడా ఇబ్బందులు పడుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్లు కూడా కొనలేని పరిస్థితి ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మహా ధర్నాకు సిద్ధమయ్యాం.

- జి.సునిత, జిల్లా అధ్యక్షురాలు



ఒత్తిడిని తట్టుకోలేక, క్షణికావేశంలో అనాలోచితంగా విద్యార్థులు ప్రాణాలను వదిలేస్తున్నారు. ప్రిన్సిపాల్ మందలించాడని, ఫీజులు కట్టలేకపోతున్నామని, పరీక్షలో తప్పారని ఇలా చిన్నచిన్న కారణాలతో ఎంతో భవిష్యత్ ఉన్న స్టూడెంట్స్ బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల విద్యార్థినీ విద్యార్థులు ఆత్మహత్యల సంఖ్యను చూస్తే ఆందోళన కలిగిస్తోంది. ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాలో పది మంది సూసైడ్ చేసుకోగా, మరొకరు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఆత్మహత్యల్లో రంగారెడ్డి జిల్లా టాప్‌లో నిలిచింది. సంవత్సర కాలంలో జిల్లాలో ఐదుగురు విద్యార్థులు అర్ధంతరంగా తనువు చాలించారు. మరో విద్యార్థి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. వికారాబాద్ జిల్లాలో ముగ్గురు, మేడ్చల్ జిల్లాలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

ఒత్తిడికి చిత్తు!

- క్షణికావేశంలో ప్రాణాలొదులుతున్న స్టూడెంట్స్
- చిన్న కారణాలతో బలవన్మరణం
- ఏడాదిలో పది మంది మృతి
- అత్యధికంగా ఐదుగురు రంగారెడ్డిలోనే..

ఉమ్మడి జిల్లాలో హడలెత్తిస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అందులో ఇద్దరు ఇంటర్ విద్యార్థులతో పాటు పదో తరగతి చదువుతున్న మరో స్టూడెంట్ ఆత్మహత్య చేసుకున్నాడు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన సాత్విక్(15) హైదరాబాద్ కూకట్‌పల్లిలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక గతేడాది మార్చిలో హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లింగపల్లికి చెందిన మరో విద్యార్థి రాఘవేందర్ (15) చైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక మార్చి 24న హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. షాద్‌నగర్ పట్టణానికి నీరజ్(15) స్థానిక శాస్త్ర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం స్కూల్‌కు వెళ్లిన అతను స్నేహితులతో కలిసి

మిగతా 6వ పేజీలో...



200 మంది సెలెక్ట్

తాండూరులో మహిళా మెగా జాబ్ మేళాకు స్పందన
400 మంది యువతుల హాజరు

తాండూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన 'మహిళా మెగా జాబ్ మేళా'కు అనూహ్య స్పందన వచ్చింది. ఆదివారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రముఖ ఎంఎన్‌సీ ఫాక్స్‌కాన్ వారి సౌజన్యంతో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మేళాకు నియోజకవర్గం నుంచి 400 మంది మహిళలు హాజరు కాగా 200 మంది సెలెక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని ఇష్టంతో ఉద్యోగం చేయాలన్నారు. కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నీరజా, ఫాక్స్ కంపెని పతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళాకు హాజరైన మహిళలు

నిరుద్యోగులకు 'రాజీవ్ యువ వికాసం'

- కార్పొరేషన్లలో రూ. 3లక్షల వరకు రుణాలు
- ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

తాండూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు మళ్లీ కల వచ్చింది. నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గడిచిన 11 ఏళ్లుగా కార్పొరేషన్ రుణాలు లభించక నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి దూరమయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం 'రాజీవ్ యువవికాసం' పేరిట నేటి నుంచి (సోమవారం) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఓబీఎంఎస్ పోర్టల్‌లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తుంది. 2025 -26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు. ఈ పథకం అర్హతలు, ఎంపిక వివరాలన్నింటిని ఆయా సంక్షేమ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందు పర్చారు. లబ్ధిదారులకువ్యక్తిగతంగా గరిష్టంగా రూ. 3లక్షల వరకుస్థానికంగా యూనిట్లు స్థాపించుకునేందుకు రుణాన్ని కార్పొరేషన్‌ల ద్వారా అమలు చేయనున్నారు. ఇందులో కేటగిరిల వారీగా రుణాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మాదిరిగా రూ. లక్ష వరకు ఒక కేటగిరి, రూ. 2-3 లక్షల వరకు మరో కేటగిరిగా వర్గీకరించి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇందులో 60 నుండి 70 శాతం రాయితీని అందజేస్తారు. వచ్చే నెల 6 నుంచి 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.



అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ధారాసింగ్

తాండూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్ ఎన్నికయ్యారు. ఆదివారం తాండూరు చైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి ఈ ఎన్నికలకు పరిశీలికుడిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షులుగా లొంక నర్సిములు (ఎల్ఎన్ఆర్), గౌరి శంకర్, నరేందర్‌నాయక్, ట్రెజరర్‌గా రాములు, ప్రధాన కార్యదర్శిగా మధు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాములు ఎన్నికయ్యారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ గౌరీశంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సుమిత్ర రాథోడ్, ఫిజికల్ డైరెక్టర్ గోపాల్, హరికృష్ణ, మధు, బుగ్గప్ప, రాధాకృష్ణ, రవికుమార్, అజీజ్, బాలమణి, మల్లేష్, రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవి పందుల స్వైర విహారం

కాలనీవాసులపై దాడి
సుప్రభాత్ టౌన్‌షిప్‌లో మహిళకు తీవ్ర గాయాలు

8

రంజాన్ మాసం పవిత్రమైంది

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం పవిత్రమైందని ముస్లింలు ఉపవాస దీక్షలతో అల్లాను ప్రార్థిస్తారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాలులో ఇఫ్తార్ విందు ప్రముఖ వ్యాపారవేత్త తస్వర్ అలీ ఏర్పాటు చేయగా స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించి ఉపవాస దీక్షలను ఖర్జూర తినిపించి విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి, హాఫీజ్, చిగుళ్లపల్లి రమేష్, నరోత్తంరెడ్డి, మైనార్టీ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

కదంతొక్కిన కాంగ్రెస్



బొంరాస్‌పేట్: తుంకిమెట్లలో దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు జిల్లాలో పలుచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలు దహనం చేశారు. బొంరాస్‌పేట్ మండలం, తుంకిమెట్లలో 163వ జాతీయ రహదారిపై జగదీశ్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కులకచర్ల, దోమ, దౌల్తాబాద్ తదితర మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలు దహనం చేశారు.

పరిగి, మార్చి16(ఆంధ్రజ్యోతి):పరిగి శివారులోని కొత్తకుంటకు మరమ్మతులు చేస్తే పట్టణానికే అందమొస్తుందని పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశరాంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.హన్మంతు, పార్టీ పట్టణాధ్యక్షుడు కృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.రామకృష్ణ అన్నారు. రూ.29.4లక్షలతో చేపడుతున్న















కొత్తకుంట మరమ్మతులతో పరిగికి అందం


పనులను పరిశీలిస్తున్న నాయకులు

పనులను వారు ఆదివారం పరిశీలించారు. కొత్తకుంట పర్యాటక ప్రాంతంగా మారుతుందన్నారు. నీటి నిల్వతో బోర్లలో నీటిమట్టం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తాపుర్యా, టి.వెంకటేశ్, అక్బర్, అయ్యూబ్, శ్రీధర్, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.







ఒత్తిడికి చిత్తు!



(5వ పేజీ తరువాయి)

క్లాసరూం నుంచి కారిడార్‌కు వచ్చాడు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ నరేందర్‌రాజయ్ వారిని మందలించాడు. దీంతో ఈ నెల 6వ తేదీన సాయంత్రం 4గంటలకు స్కూల్ పైఅంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన షాద్‌నగర్‌లో కలకలం రేపింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా మరో విద్యార్థిని ఆత్మహత్యా యత్నం చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీనగర్ కాలనీకి చెందిన సీహెచ్.గౌతమ్ ఆదిభట్లలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదివేవాడు. కండ్లకలక రావడంతో 2023 ఆగస్టు 14న కాలేజీలో ఉరేసుకున్నాడు. ఇతడి మృతి అనుమానాస్పదంగా మారింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నాయిగూడకు చెందిన విద్యార్థిని షైలపాక సోని ఆదిభట్లలోని అగస్త్య జూనియర్ కళాశాల, టీసీఎస్ బ్రాంచ్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్(మెడిసిన్) తీసుకుంటూ గత నెల 6న అనారోగ్యంతో మృతిచెందింది. ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురై మృతిచెందినట్లు తెలిసింది. పోలీసులు మాత్రం ఎఫ్ఐఆర్‌లో అనారోగ్యకారణమనే నమోదు చేశారు. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధి చర్లపటేల్‌గూడలోని జ్యోతిరావు పూలె బీసీ బాలికల రెసిడెన్షియల్‌లో పదో తరగతి విద్యార్థిని గడ్డ లావణ్య(15) 2024 నవంబరు 9వ తేదీన భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. "నీకు చదువు రాదు.. చదివి కూడా వేస్ట్" అని టీచర్లు మందలించడంతో ఆత్మహత్యాయత్నం చేసిందని బాలిక తల్లిదండ్రుల ఆరోపణ. తల్లిదండ్రులు వచ్చి చూడటం లేదనే ఆమె భవనం పైనుంచి దూకిందని పాఠశాల వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ విద్యార్థిని రాజేంద్రనగర్ సమీపంలోని లక్ష్మీగూడలో ఇంట్లోనే బెడ్‌రెస్ట్‌లో ఉంది.

కాగా వికారాబాద్ జిల్లాలో ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న శాలిని అనారోగ్యం బారినపడి ఇంట్లో ఉరివేసుకుంది. ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న జ్యోతి అనే విద్యార్థిని ఇంట్లోని వారంతా ఊరికి వెళ్లగా తానింట్లో ఉండి చదువుకుంటానని చెప్పి ఉరేసుకుంది. జ్యోతి ఎందుకు ఆత్మహత్య చేసుకుందనే విషయం తెలియరాలేదు. పరిగి నియోజకవర్గం కుల్కచర్లలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో వారం క్రితం టెన్త్ విద్యార్థి దేవేందర్ నిద్రిస్తున్న బెడ్‌పైనే చనిపోయాడు.

ఫీజుల కోసం వేధింపులు

కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల వసూలు కోసం విద్యార్థులపై తీసుకొస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు తనువు చాలిస్తున్నారు. తల్లిదండ్రులకు స్థోమత లేకున్నా పిల్లల భవిష్యత్తు కోసం కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పి చితికిపోతున్నారు. ఫీజులు చెల్లించలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతూ తమ వందేళ్ల జీవితాలను ముగించేసుకుంటున్నారు. విద్యాసంస్థల హబ్‌గా పేరుగాంచిన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో విద్యాసంస్థలు ఫీజుల విషయంలో చేస్తున్న వేధింపులు తాళలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇటీవల మేడ్చల్‌లోని శ్రీచైతన్య పాఠశాల 10వ తరగతి విద్యార్థి అఖిల ఇంట్లో ఉరేసుకోవడం అందరినీ కలచివేసింది.

విద్యార్థులపై పెరుగుతున్న చదువుల భారం

మేడ్చల్‌లోని కిష్టాపూర్ వీఎంఆర్ కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థి సిద్ధార్థయాదవ్ చదువు ఒత్తిడి తట్టుకోలేక, హాస్టల్‌లో ఉండలేక ఉరి వేసుకున్నాడు. ఘట్‌కేసర్ అన్నోజిగూడలోని నారాయణ కళాశాలలో తనుష్‌నాయక్(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదివేవాడు. చదువు ఒత్తిడిని భరించలేక కాలేజీ వాష్‌రూంలో ఉరేసుకున్నాడు. అనురాగ్ యూనివర్సిటీలో సీఎస్‌సీ రెండో సంవత్సర విద్యార్థి నక్కిరెడ్డి జ్ఞానేశ్వర్‌రెడ్డి డీన్ మందలించాడని 2024 ఫిబ్రవరి 7న కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్నాయత్నం చేశాడు. దీంతో జ్ఞానేశ్వర్‌రెడ్డికి కాళ్లు విరిగాయి. నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. క్లాస్‌లో అందరి ముందు తనను తిట్టాడని సదరు విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు.

ఫ్యామిలీ పెన్షన్ అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల(ఫ్యామిలీ పెన్షన్‌దారులు) కుటుంబాలకు పూర్తిస్థాయిలో ఫిబ్రవరి నెల పెన్షన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఫ్యామిలీ పెన్షన్‌దారుల్లో కొందరికి పెన్షన్ ఇచ్చి మరికొందరికి ఇవ్వక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం జిల్లా కార్యవర్గ అధ్యక్షుడు హెచ్.డీ.ద్వారకానాథ్, అసోసియేట్ అధ్యక్షుడు జొన్నల బస్వరాజ్, ప్రధాన కార్యదర్శి కామిడి నర్సింహారెడ్డి, కోశాధికారి జూకారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా పెన్షన్ వస్తేనే కుటుంబావసరాలు తీరడం కష్టంగా మారిన ఈ రోజుల్లో పెన్షన్ అందకపోతే ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఫ్యామిలీ పెన్షన్‌దారులందరికీ పెన్షన్ డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిరంజనమఠంలో ఆరాధనోత్సవాలు

కొడంగల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) కొడంగల్‌లోని నిరంజన మఠంలో ఆదివారం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు మఠం మల్లికార్జున్, గడ్డం చంద్రశేఖర్, మఠం విజయ్‌కుమార్ స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, చక్కెర, గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో బసవలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతులు డాక్టర్ సిద్ధలింగమహాస్వామికి వీరశైవ లింగాయత్ సభ్యులు పాదపూజ చేశారు. పల్లకి సేవ ముందు ఖడ్గాలు వేస్తూ స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గురునాథ్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. గురునాథ్‌రెడ్డిని సిద్ధలింగమహాస్వామి శాలువాతో సత్కరించారు. ఆలయ భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌వర్ధన్, బుక్క విజయ్‌కుమార్, సంగమేశ్వర్, బాలప్రకాశ్, రవి, సర్వేశ్, రాకేశ్ పాల్గొన్నారు.


అలంకరణలో బసవలింగేశ్వరస్వామి


గుర్నాథరెడ్డిని సన్మానిస్తున్న సిద్ధలింగస్వామి

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ప్రతొక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక చింతనకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని నిరంజన మఠాధిపతి డాక్టర్ సిద్ధమహాలింగస్వామి అన్నారు. ఆరాధనోత్సవాల్లో ఆయన మాట్లాడారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని అంకుశాపూర్ శ్రీభవానీశంకర ఆలయ కమిటీ చైర్మన్ రాజమహేందర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఏసీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో రామ్‌సేన టీం ట్రోఫీని గెలుచుకుంది. ఆయన ట్రోఫీ, 10వేల నగదు, రన్నర్స్‌కు బీఆర్ఎస్ నాయకుడు రాజు ఐదు వేల నగదును అందజేశారు. నిర్వాహకులు గణేష్, నరేష్, గోపాల్ రెడ్డి, మంగారెడ్డి, అంజనేయులుగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందజేస్తున్న బత్తుల రాజమహేందర్‌గౌడ్

పత్తి కట్టెతో కంపోస్టు

● సహజ ఎరువుతో రైతులకు తగ్గనున్న పెట్టుబడి ఖర్చు



మల్కాపూర్ గ్రామంలో తీరిపోయిన పత్తి చేను

చేవెళ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వానకాలంలో సాగుచేసిన పత్తి పంట పత్తితీత పూర్తయిక కట్టెను సాధారణంగా రైతులు కాల్చేస్తుంటారు. ఇలా చేస్తే భూమికి, రైతుకు ఉపయోగమేమీ ఉండదు. పత్తికట్టెతో వర్మి కంపోస్టు తయారు చేసుకొని పంటలకు ఎరువుగా వాడుకోవచ్చని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి ఏరిన తర్వాత మొక్కల్ని వేర్లతో సహా పీకి కుప్పగా వేయాలి. కట్టె పరిమాణాన్ని బట్టి 30-50ఫీట్ల పొడవు, 3ఫీట్ల వెడల్పు, 3ఫీట్ల లోతుతో ఇటుకలతో కుండీలు కట్టుకోవాలి. అడుగున మొరం పోసి నేలను గట్టిపర్చాలి. ఎండకు వాడనకు ఆచ్ఛాదనగా కుండీలకు షెడ్డు వేసుకోవాలి. కుప్పగా వేసిన కట్టెను ట్రాక్టర్‌తో తొక్కించి పుల్లలుగా చేయాలి. దానిపై వారం రోజులు పశువుల పేడను వేయాలి. ఈ మిశ్రమాన్ని కుండీల్లో నింపి, నీటిని పోస్తుండాలి. అలా నాలుగైదు లేయర్ల వరకు పత్తి కట్టెను నింపాలి. చివరగా పెండ కలిపిన నీటిని చల్లాలి. రోజూ కుండీలో అప్పుడప్పుడు నీరు చల్లాలి. తరువాత ఒక్కో కుండీపై 20కిలోల చొప్పున వానపాముల్ని వదలాలి. అవి కుళ్లిన పత్తికట్టెను తింటూ... విసర్జితాలతో 20 నుంచి 25 రోజుల్లో కంపోస్టు తయారవుతుంది.

పంటలకు సూక్ష్మధాతు పోషకాల లభ్యత

పత్తి మోడులో పశువుల పేడకంటే రెట్టింపు నత్రజని, ఎనిమిది రెట్లు అధికంగా పొటాష్ ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. పత్తిలో దూది 40శాతం ఉంటే 60శాతం మోడు ఉంటుంది. ఎకరానికి 6క్వింటాళ్ల వరకు పత్తి కట్టె వస్తుంది. దీనిని భూమిలో కలియదున్నడం వల్ల 10కిలోల నత్రజని, 36కిలోల పొటాష్ భూమికి అందుతుంది. మాంగనీస్ 365పీపీఎం, ఇనుము 2,791పీపీఎం, రాగి 27పీపీఎం చొప్పున ఉంటాయి. పత్తి కట్టెలను కలియదున్నడం వల్ల తరువాతి పంటకు కావాల్సిన పొటాష్ మొత్తాన్ని, అలాగే 20శాతం వరకు నత్రజని లభిస్తుంది.

ఎన్నో ప్రయోజనాలు

పత్తి కట్టెతో వర్మి కంపోస్టు తయారీతో పలు ప్రయోజనాలు ఉన్నాయి. కంపోస్టు తయారీకి రైతుకు అవసరమైన పత్తి కట్టె ఒకేసారి ఎక్కువ పరిమాణంలో దొరుకుతుంది. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ సేంద్రియ ఎరువును తయారుచేసుకోవచ్చు. కంపోస్టు తయారైన వెంటనే అదే భూమిలో వేసే పంటకు ఎరువుగా వేసుకోవచ్చు. కాబట్టి దీనిని నిల్వచేసుకోవాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల భూభౌతిక పరిస్థితులు మెరుగుపడతా యి. భూమిలో హ్యూమస్ శాతం పెరిగి నీటి నిలువ చేసుకునే పరిస్థితొస్తుంది. రసాయన ఎరువుల వినియోగమూ తగ్గుతుంది.

కట్టెను భూమిలో కలియదున్నినా సరిపోతుంది



పత్తి కట్టెలను కాల్చకుండా భూమిలో దున్నినా ఇబ్బంది లేదు. 36బ్లేడ్‌లు, 5 ఫీట్ల పొడవైన రోటావేటర్‌ను 45హెచ్‌పీ ట్రాక్టర్‌తో తీరిపోయిన పత్తి చేనులో దున్నితే రైతులకు లాభాలున్నాయి. ఇలా చేస్తే పత్తి కట్టె భూమిలో కలిసిపోయి ఆరు ఇంచ్‌ల లోతు వరకు మట్టి కూడా తలకిందులైతుంది. పత్తి కట్టె కుళ్లి పంటకు కంపోస్టు ఎరువుగా ఉపయోగపడుతుంది.

- శంకర్‌లాల్, ఏవో, చేవెళ్ల

రూ.10వేల వేతన హామీని అమలు చేయండి

● మధ్యాహ్న భోజన కార్మికుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

షాద్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పడుతున్న ఇబ్బందుల గురించి అసెంబ్లీ, శాసనమండలి దృష్టికి తీసుకువెళ్లాలని భోజన కార్మికులు కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు 8నెలలుగా గుడ్లు, 3 నెలలుగా వేతనం, గౌరవవేతనం, మెనూచార్జీల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అప్పు తెచ్చి విద్యార్థులకు వండిపెడుతుండడంతో కార్మికులు కష్టాలుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు ఇవ్వకున్నా విద్యార్థులకు వండిపెట్టాలని ఒత్తిడి సరికాదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, మెనూచార్జీలు మాత్రం పెంచడంలేదన్నారు. ఏళ్ల తరబడి వేతనాలు పెంచలేదన్నారు. వారానికి మూడుసార్లు గుడ్లు ఇవ్వాలని నిబంధన పెట్టారుగానీ సరిపోను బడ్జెట్ ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భోజన కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీలత, శ్రీనివాస్, వసంత, సంతోష, సత్తెమ్మ, వెంకటమ్మ, అనిత, షహీనబేగం తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలి



విజేత స్కూల్ విద్యార్థులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్

కోట్‌పల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం కోట్‌పల్లిలోని విజేత టాలెంట్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరుతేవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో డ్యాన్సు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వెంకట్ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్, నరసింహారెడ్డి, బందయ్య, జగన్నాథ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎండలతో జాగ్రత్త

● ఉదయం 10గంటలకే సూర్యుడు భగ్గు
● వడదెబ్బకు గురయ్యే ప్రమాదం
● స్వీయ రక్షణే మేలంటున్న వైద్యులు



దుద్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు భగ్గుమంటున్నాయి. తీవ్ర ఉష్ణోగ్రతలు, వడగాలుల సమయంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా నీరు తాగాలని చెబుతున్నారు. ఉబ్బరం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి నీరు, కూల్ డ్రింక్స్, జ్యూస్ వైపు మొగ్గు చూపుతున్నారు. అదే విధంగా కూలర్లు, ఫ్యాన్‌ల కింద సేద తీరుతున్నారు.

● ఎండలో వెళ్లే సమయాల్లో...

బయటకు వెళ్లే సమయంలో నీటి బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులనే ధరించడం మంచిది. టోపీ, టవల్ లాంటి వాటిని ఎండకు ఆచ్ఛాదనగా కప్పుకోవాలి. గొడుగు పట్టుకోవాలి. ఎండలో నడిస్తే చెప్పులు తప్పక ధరించాలి. ఇంట్లో తయారు చేసిన మజ్జిగ, నిమ్మరసం లాంటివి వెంట తీసుకెళ్లాలి. సంత్ర, ద్రాక్ష, పుచ్చ, తర్బూజ లాంటి అధిక నీటి శాతం ఉన్న పండ్లను తినాలి. వివిధ పండ్ల రసాలూ తాగాలి. చెరకు రసం కూడా తాగితే ఎండలో శరీరానికి అవసరమయ్యే మినరల్స్ లభిస్తాయి. భోజనంలో ఆకుకూరలు. కూరగాయలు ఎక్కువగా తినాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లేలా చూసుకోవాలి. మధ్యాహ్న సమయాల్లో వంట గదిలో వంట చేయకూడదు. తప్పనిపరిస్థితుల్లో వంట చేయాల్సి వస్తే వెంటిలేషన్ ఉండాలి. తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలి. మద్యం, కాఫీ, టీ వంటి వేడిచేసే పానీయాలు ఎక్కువ తాగకూడదు. ఆరుబయటకు పనిచేసే కూలీలు పని ప్రదేశాల్లో తాగునీటిని ఉంచుకోవాలి. 30 నిమిషాలకోసారి ఓ గ్లాసు నీరు తాగాలి. ఎండల్లో సాధారణ వ్యక్తుల కంటే రోగులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. శిశువులు, చిన్నారులు,గర్భిణులు, వృద్ధులు బయట పనిచేసే కూలీలు, అధిక రక్తపోటున్నవారు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు.. జాగ్రత్తలు

వడదెబ్బ తగిలితే తీవ్ర జ్వరం, తలనొప్పి, బీపీ తగ్గి కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటాయి. వాంతులు, విరేచనాలయ్యే అవకాశం ఉంటుంది. నాలుక తడారుతుంది. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే ఎండ నుంచి చల్లని ప్రదేశానికి తీస్కొచ్చి సేదదీర్చాలి. తడి బట్టతో తుడవాలి. మజ్జిగ, నీరు, కొబ్బరినీరు తాగించాలి. ప్రథమ చికిత్సానంతరం ఆసుపత్రికి తీస్కెళ్లాలి.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి



వేసవి ఎండలు తీవ్రమయ్యాయి. ఎండలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు. మధ్యాహ్నం 12నుంచి 3గంటల సమయంలో ఎంత తీవ్రత ఎక్కువ. ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఎండలో చెప్పులు, తలకు టోపీ లేదా రుమాలు ధరించి ప్రయాణం చేయాలి.

- రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

ఉద్యోగుల బిల్లులు మంజూరు చేయాలి



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఇతర సమస్యల సాధనకు రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో శాసన సభ్యులకు వినతిపత్రాల అందజేత, మే 15న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. జూన్ 5 నుంచి 9 మధ్య రాష్ట్రస్థాయిలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలన్నారు. ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని అన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో స్థానికేతరుల కోటా మించిపోయిందని, దీంతో స్థానిక నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి, నాయకులు సుధాకర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రావు, రాజమణి, వీరమణి, భార్గవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు.

డ్రగ్స్ విక్రయించిన నిందితుడి రిమాండ్

శంషాబాద్ రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి):డ్రగ్స్ అమ్ముతూ పట్టుపడిన నిందితుడిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఆర్జీఐఏ స్టేషన్‌లో ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన అభిషేక్ సంజయ్ తోరట్(24) శంషాబాద్ పరిసరాల్లో డ్రగ్స్ అమ్ముతున్నట్లు సమాచారం రాగా ఎస్‌వోటీ టీం గణేష్ టాకీస్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుందన్నారు. 13గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుందన్నారు.నిందితుడు మహారాష్ట్రలో కిరాణ షాప్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఖేల్‌ఖూద్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పరిగి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో నిర్వహించిన ఖేల్‌ఖూద్ పోటీల్లో పరిగి సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు ప్రతిభను చాటారు. అండర్-14 బాలుర, బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖోల్లో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. జట్టు, వ్యక్తిగతంగా మొత్తంగా 16 బహుమతులను అందుకున్నారు. ఖోఖోలో బాలురు, బాలికలు ప్రథమస్థానం నిలిచారు. కబడ్డీ, బాడ్మింటన్‌లో బాలురు ప్రథమస్థానం, వాలీబాల్‌లో బాలురు తృతీయస్థానం, రిలే పరుగులో, ఇతర అథ్లెటిక్స్ అంశాల్లో సెకండ్ ప్లేస్‌లో నిలిచారు.



ప్రతిభచాటిన విద్యార్థినులతో హెచ్ఎం

సేవలకు గుర్తింపుగా సేవా వైభవరత్న అవార్డు



వైభవ రత్న అవార్డును అందుకుంటున్న కటకం శివకుమార్ గుప్తా

కొడంగల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సర్. సీవీ రామన్ అకాడమి (సేవా సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ హర హర కళాభవన్‌లో నిర్వహించిన 33వ సంవత్సరం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో కొడంగల్‌కు చెందిన ఆర్యవైశ్య సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్, లయన్స్ క్లబ్ కార్యదర్శి కటకం శివకుమార్‌గుప్తాకు సేవా వైభవ రత్న అవార్డును అందించారు. ఉగాది పురస్కారాల అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 60మందికి అవార్డులు అందించినట్లు శివకుమార్ తెలిపారు. సేవలకు గుర్తింపుగా తనకు సేవ వైభవరత్న అవార్డు, గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందించి సన్మానించారని వివరించారు. ఈ సందర్భంగా ఆయన సర్.సీవీ రామన్ అకాడమీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అడిషనల్ డీఎస్పీ ఆనంద్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి కాన్షీరామ్

ఘట్‌కేసర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల రాజకీయ, సామాజిక, ఆర్థిక విముక్తి కోసం జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి కాన్షీరామ్ అని నాయకులన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి కాన్షీరామ్ 91వ జయంతిని నిర్వహించారు. చిన్నప్పటి నుంచే కాన్షీరామ్ ఆత్మగౌరవం, క్రమశిక్షణతో కూడుకున్న జీవితాన్ని గడిపారన్నారు. సిక్కు మతంలో పుట్టినా ఏనాడూ మతం గురుంచి మాట్లాడలేదన్నారు. నాయకులు, యువత అయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాంరెడ్డి, నిర్వాహకుడు అరుణ్‌కుమార్, దాసు, సరేష్, నర్సింగరావు, రాధాకృష్ణ, శ్రీనివాస్, యాదగిరి, గణేష్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కొడంగల్ రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామంలో ఉపాధి పనులపై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. జరిగిన పనులకు సంబంధించిన నిధులు, కూలీలకు చెల్లింపులపై తనిఖీ అధికారులు వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చారు.

మహేశ్వరం ఏఎంసీ అభివృద్ధికి కృషి చేయాలి



కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎంసీ నూతన డైరెక్టర్లు, నాయకులు

కందుకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేలా కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎంసీ డైరెక్టర్లుగా నియామకమైన మండలానికి చెందిన ఎ.పుష్పదర్శన్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.ప్రశాంత్‌కుమార్ ఆదివారం కేఎల్లార్‌ను తుక్కుగూడ క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఆయన వారితో మాట్లాడారు. మార్కెట్ కమిటీలో అన్ని వర్గాలకు సమ న్యాయం జరిగిందని, చైర్మన్ కృష్ణానాయక్, వైస్‌చైర్మన్ యాదయ్య, కమిటీ మెంబర్లంతా ప్రభుత్వ పథకాలను రైతులకు వర్తింపజేసేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు నాగని శ్రీహరి కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు అఫ్జల్‌బేగ్, రాఖేష్‌గౌడ్, బొర్ర సురేశ్, ఎ.బాలయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మల్లన్న బోనాలు



షాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి):తిమ్మారెడ్డిగూడలో ఆదివారం మల్లన్నస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. దేవతలకు బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు మల్లన్న స్వామి ఆలయానికి తరలి మొక్కులు చెల్లించారు. మహిళలు బోన నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ మర్రి చెట్టు

● వాహనదారులకు త్రుటిలో తప్పిన ముప్పు

చేవెళ్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై పడిపోయిన మర్రిచెట్టును చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. చేవెళ్ల మండల పరిధి ఖానాపూర్ గేట్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న మర్రి వృక్షం ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. దీంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు చేసుకొని ఎక్స్‌కవేటర్‌తో మర్రి చెట్టును తొలగించారు. మర్రి చెట్టుపడిన సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో త్రుటిలో ముప్పు తప్పిందని పోలీసులు, వాహనదారులు అన్నారు. రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చేవెళ్ల ట్రాఫిక్ ఏఎస్సై చందర్‌నాయక్, సిబ్బంది పర్యవేక్షించారు.



ఎక్స్‌కవేటర్‌తో మర్రి చెట్టును తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మంచి పనులకు చిరస్థాయి కీర్తి

కడ్తాల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మనుషులు జీవిత కాలంలో చేసిన మంచి పనులను వారి మరణానంతరం కూడా గుర్తుంచుకుంటారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి అన్నారు. కడ్తాలలో ఆదివారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం గూడూరు రవీందర్‌రెడ్డిల తండ్రి నారాయణరెడ్డి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరుణ, స్వప్న, జయమ్మ, రజిత, ప్రభాకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, కిషోర్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, ఉదయ్, స్రవంతి, తరత్, నాయకులు బట్టు కిషన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహ, చందోజీ, రామ్‌రెడ్డి, వెంకటేశ్, లక్ష్మయ్య, బిచ్యా, అశ్లేషరెడ్డి, సత్యం, మల్లేశ్‌గౌడ్, జగన్, లక్ష్మీనర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.



నారాయణ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, వంశీచంద్ రెడ్డి

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

చౌదరిగూడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొందుర్గు మండల పరిధి రేగడి చిల్కమర్రి ప్రీమియర్ లీగ్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆటలో గెలిచి బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉంటుందని, ఏ క్రీడలోనైనా క్రీడాకారులు స్ఫూర్తిమంతంతో ఆడాలని, గెలిచేందుకు ముందుకు సాగాలని అన్నారు. క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగేందుకు పట్టుదలతో కృషిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామృష్ణ, రవీందర్‌రెడ్డి, బందులాల్, బుచ్చయ్య, ఖలీల్, రవిగౌడ్, సుందర్, వాసురి, నర్సింహులు రాములు, హరీశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, మల్లారెడ్డి, గణేష్, రాఘవేందర్‌రెడ్డి, రవి, రాకేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి చేయూత

నందిగామ మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా తనవంతు చేయూత అందిస్తానని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆదివారం ఆలయ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఆలయ ముఖద్వారం(ఆర్చ్) నిర్మాణం చేపడతానని తెలిపారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అలాగే అంతిరెడ్డిగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు తుమ్మల జగన్ ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.లక్ష చెక్కును కుటుంబ సభ్యులతో కలసి ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆల య కమిటీ మెంబర్లు బాల్‌రెడ్డి, ఎల్లయ్య, కుమార్‌గౌడ్, అశోక్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, కుమార్‌గౌడ్, జంగయ్యగౌడ్, పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

చిట్టిఘనాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చిట్టిఘనాపూర్‌లో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామ పెద్దల సమక్షంలో కాంగ్రెస్ నాయకులు పటేల్ విజయ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డిల సహకారంతో గ్రామంలో మస్యలు పరిష్కరించుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం గ్రామంలో కుర్వ మహేష్ ఇంటి నుంచి చెరువు కట్ట రోడ్డు వరకు సీసీ రోడ్డు వేస్తామని నాయకులు తెలిపారు. ఏళ్లుగా ఉన్న సమస్య కాంగ్రెస్ ప్రభుత్వంలో తీరుతోందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పటేల్ విజయ్‌కుమార్, పటేల్ బసిరెడ్డి, జగ్గుపటేల్, ఎం.బసిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, మహేశ్, పట్లోళ్ల బసప్ప తదితరులు పాల్గొన్నారు.

భార్యను బస్సుకిందికి తోసిన భర్త

● తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
● భర్తను పోలీసులకు అప్పగించిన స్థానికులు

శంషాబాద్ రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి భార్యను ఆర్టీసీ బస్సు కిందికి తోసిన ఘటన శనివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. ఆర్జీఐఏ స్టేషన్ ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం కౌకుంట్లకు చెందిన బందన్న, భార్య పద్మ బతుకుదెరువు కోసం శంషాబాద్ పరిధి రాళ్లగూడకు వచ్చారు. శనివారం రాత్రి స్వగ్రామం వెళ్లేందుకు బస్‌స్టాండ్‌కు వచ్చారు. అక్కడ భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బందన్న పద్మను కదులుతున్న బస్ కిందికి నెట్టాడు. గాయాలైన ఆమెను 108అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. స్థానికులు బందన్నకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పద్మ పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారని ఎస్సై తెలిపారు. అయితే ఇద్దరూ మద్యం తాగారని, కదులుతున్న బస్సు ఎక్కబోయి పద్మ బస్సు కింద పడిందని పోలీసులు చెబుతున్నారు. గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ చెప్పారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైలారం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు మూడావత్ రాములునాయక్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువాతో సన్మానంతో స్వామివారి విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాములునాయక్, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల స్వైరవిహారం

- పలు కాలనీవాసులపై దాడులు
- సుప్రభాత్ టౌన్‌షిప్‌లో.. మహిళకు తీవ్ర గాయాలు
- బిక్కుబిక్కుమంటున్న దివ్యానగర్

ఘట్‌కేసర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంక్రీట్ జంగిల్‌లో అడవి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి..! కాలనీల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉదయం వేళల్లో వ్యాహ్యాళికి వెళ్తున్నవారు.. రాత్రిళ్లు బైకులపై ప్రయాణాలు చేసేవారిపై దాడులు చేస్తున్నాయి. హైదరాబాద్ శివార్లలోని ఘట్‌కేసర్ మండలం కాచ్వానిసింగారం గ్రామ పరిధిలోని సుప్రభాత్ టౌన్‌షిప్, దివ్యానగర్ కాలనీల్లో అడవి పందుల దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సీసీకెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా.. వారు పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల అడవి పందుల బాధితులు పెరుగుతున్నారని ఆ కాలనీల వాసులు వాపోతున్నారు. ఆదివారం ఉదయం 6.30 సమయంలో సుప్రభాత్ టౌన్‌షిప్‌లో కొందరు మహిళలపై అడవి పందులు దాడి చేసినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ దాడిలో సుజాత అనే 72 ఏళ్ల మహిళ తీవ్రంగా గాయపడ్డారని వివరించారు.


సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సంచరిస్తున్న అడవి పందిని తరుముతున్న స్థానికుడు

ఇదే కాలనీలోని ఓ ఇంటి యజమానిపైనా అడవి పంది దాడి చేయడానికి ప్రయత్నించగా.. ఆయన కర్ర సాయంతో దాన్ని అదిలిస్తూ తప్పించుకున్న దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి. దివ్యానగర్, సింగరేణి కాలనీ మెయిన్ రోడ్డుపైనా రాత్రిళ్లు వెళ్లే ద్విచక్రవాహనదారులు అడవిపందులు అడ్డురావడంతో కిందపడి గాయాలపాలైన సంఘటనలున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాలు పోచారం మునిసిపాలిటీ పరిధిలోకి వస్తాయి. పీర్జాదీగూడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రియ కాలనీలోనూ అడవి పందుల సంచారం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఇటీవల అప్రోచ్ రోడ్లకు అడ్డుగా ఉన్న గోడలను హైడ్రా కూల్చివేయడంతో అడవి పందులు కాలనీల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జగదీశ్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకుల ఆందోళనలు
- దిష్టిబొమ్మలు దహనం


పరిగి: కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

పరిగి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన వాఖ్యలను నిరసిస్తూ పరిగి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇ.కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం పరిగి బస్టాండ్ దగ్గర రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాజీ మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పరశురాంరెడ్డి, హన్మంత్ ముదిరాజ్, కృష్ణ, రామకృష్ణ, తావుర్యానాయక్, వెంకటేశ్, అక్బర్‌సేట్, అయూబ్, శ్రీధర్ పాల్గొన్నారు.

పూడూరు మండల పరిధిలోని మన్నెగూడలో టీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలతో నిరసన వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.అనంతరం కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కద్మూర్ ఆనందం, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, సతీశ్‌రెడ్డి, పెంటయ్య, శ్రీనివాస్, అజీమ్ పటేల్ పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగదీశ్‌రెడ్డిని ఎమ్మెల్యే పదవీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్.ఆంజనేయులు, మొగులయ్య, ఖైపాల్‌రెడ్డి, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

దోమ: స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: అసెంబ్లీలో స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని తుంకిమెట్లలో ఆదివారం జాతీయ రహదారిపై ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. దిష్టిబొమ్మలతో శవయాత్ర నిర్వహించి గ్రామ కూడలికి తీసుకొచ్చి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, అంజిల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్, వెంకట్రాములుగౌడ్, హనీఫ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టబొమ్మలను దహనం చేశారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేయాలన్నారు.

చౌడాపూర్: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, నాగరాజు, రాములు, సలీమ్, గోపాల్‌నాయక్, చెన్నయ్య, రాము పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలి

మేడ్చల్ టౌన్: అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను అవమానించే విధంగా మాట్లాడిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై అనర్హత వేటు వేసి శాసన సభ్యత్వం రద్దు చేయాలని మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ పట్టణంలో జగదీశ్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, రమణారెడ్డి, సత్యనారాయణ, సంతోష్, శంకర్ ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రతినిధి: తూంకుంటలో ఆదివారం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. అసెంబ్లీలో స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రవర్తనకు నిరసనగా తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి, పెండం లక్ష్మీనారాయణ, మధుసూధన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, యాదగిరి, మురళిగౌడ్, జగదీశ్ గౌడ్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అవమాన పరిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు ముత్యాలు, రాదాకృష్ణ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, జంగయ్య, వెంకటేష్, పావని, అనిత, శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కీసర రూరల్: అసెంబ్లీ స్పీకర్‌ను కించపరుస్తూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దమ్మాయిగూడ ప్రధానకూడలిలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ముప్ప రామారావు, నరేందర్ రెడ్డి, శ్వేత, శ్రీలత, ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

పోరుకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

సిద్ధమయ్యారు. కలెక్టరేట్‌ల ఎదుట వంటా వార్పు నిర్వహించనున్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలని, అంగన్‌వాడీలకు బెనిఫిట్స్ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆరోగ్యలక్ష్మి మెనూ ఛార్జీలు పెంచాలని కోరుతున్నారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర



ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతున్నది. ఇందులో భాగంగానే మొబైల్ సెంటర్స్ ఏర్పాటు చేశారు. మొబైల్ సెంటర్స్‌ను, ఎన్ఈపీని తక్షణమే ఉపసంహరించుకోవాలి. అంగన్‌వాడీ ఉద్యోగులకు, హెల్పర్లను పర్మినెంట్ చేయాలి. - శోభారాణి, సెక్రటరీ

పన్ను వసూళ్లలో లక్ష్యం చేరుకోకపోతే చర్యలు: జేడీ

తాండూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో తాండూరు మున్సిపాలిటీ పూర్తిగా వెనుకబడి ఉందని, లక్ష్యాలను చేరుకోకపోతే కఠిన చర్యలు తప్పవని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ (జేడీ) బి.శ్రీనివాస్ హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు బిల్ కలెక్టర్లు, ఆర్ఐలపై చర్యలతో పాటు ఇంక్రిమెంట్లు నిలివేయాల్సివస్తుందన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడిన తాండూరు మున్సిపాలిటీ పర్యటించి అనంతరం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీలో 33శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయని తెలిపారు. కనీసం 90శాతానికి పైగా పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఆర్ఐలు, బిల్‌కలెక్టర్లు ఉన్నారు.

రామలింగేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ


రామలింగేశ్వరుని సేవలో ఎమ్మెల్సీ దంపతులు

కీసర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఆదివారం కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ మేరకు శ్రీపాల్‌రెడ్డి గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీపాల్‌రెడ్డి దంపతులకు అర్చకులు స్వామివారి ఆశీర్వచనలు, తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, తటాకం భాను శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

23న ఇఫ్తార్ విందు

తాండూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రంజాన్ని మాసాన్ని పురస్కరించుకొని తాండూరు నియోజవకర్గంలోని ముస్లీం సోదరులకు ఈనెల 23న ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముస్లింలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. చెనెగేష్‌పూర్ రోడ్డు మార్గంలోని క్లాసిక్‌గారెన్‌లో ఈవిందును నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, వడ్డె శ్రీనివాస్, ముస్లీం నాయకులు సర్దార్ ఖాన్, అబ్దుల్‌రవూఫ్, జుబేర్ లాల, అక్బర్ బాబా పాల్గొన్నారు.

వైభవంగా ఆరెమైసమ్మ జాతర


ఆరెమైసమ్మ జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెపల్లి గేటువద్ద గల ఆమెమైసమ్మ దేవతకు ప్రతి యేడాది గ్రామస్తులు జాతర ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో వచ్చి పిండివంటలతో చేసిన నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న చీఫ్‌విప్

మారెపల్లి సమీపంలోని ఆరెమైసమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిలు వేర్వేరుగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజయ్య, యువనాయకులు మహిపాల్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల వేదిక ప్రారంభం

పెద్దేముల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వేదికను స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. అదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ద్యావరి నరేందర్‌రెడ్డి వారి తల్లితండ్రుల జ్ఞాపకార్థం రూ 1లక్షా 80వేలు వ్యయం చేసి పాఠశాలలో నిర్వహించే పలు కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా వేదికను నిర్మించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని ఎమ్మెల్యే అభినందించారు. ఈకార్యక్రమంలో నారాయణరెడ్డి, నరేందర్ రెడ్డి, శోభారాణి, ఎల్లారెడ్డి, కిరణ్‌కుమార్, లాల్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

యాలాల, మార్చి 16, (ఆంధ్రజ్యోతి) : యాలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆదివారం పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు చేరుకుని తమకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులను కలిశారు. విద్యార్థులంతా ఒకరికొకరు కలుసుకుని పలకరించుకున్నారు. తమ గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిద్రామేశ్వర్, ఉపాధ్యాయులు ఆనందం, మోహన్, శాంతప్ప, సర్దార్, బాలయ్య, సావిత్రమ్మ, పూర్వ విద్యార్థులు సాయిలుగౌడ్, అశోక్, నర్సింహులు, నరేష్, అంజి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రబృందం

కులకచర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజాహిద్‌పూర్‌లోని ఉన్నత పాఠశాలలో 2002-03 పదో తరగతి చదివిన సందని నర్సిములు (40) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఆదివారం గ్రామానికి వెళ్లి కుటుంబానికి రూ.35వేలు ఆర్థిక సహాయం అందించారు. మృతుడికి ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. పిల్లల చదువు విషయంలో అండగా ఉంటామని వారు తెలిపారు.

సంక్షిప్తంగా..

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

దౌల్తాబాద్: మాటూర్ నుంచి నీటూర్ వరకు బీటీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. కొడంగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, వీరన్న భూమి పూజ చేశారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం

పరిగి: ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాముయాదవ్ అన్నారు. మహాశారద అస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గడిసింగాపూర్ గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్యశిబబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి బృందం రోగులకు చికిత్సలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలకిష్టారెడ్డి, నర్సింహులు, అంజన్ యాదవ్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కీసర: కీసర గ్రామానికి చెందిన రామిడి యాదిరెడ్డి ఆకస్మాత్తుగా మృతిచెందగా విషయం తెలుసుకున్న కీసర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామిడి విజయ్‌రెడ్డి, సంఘం తరఫున అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అధికార పార్టీ నాయకులు రోడ్లపైకి రావడం శోచనీయం

దోమ: జాతీయ భావాలు కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేయడం, దిష్టిబొమ్మలు దహనం చేయడం శోచనీయమని సర్పంచుల సంఘం దోమ మండల మాజీ అధ్యక్షుడు కే.రాజిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో చర్చలో భాగంగా ఈ సభ ఎవరి సొంతం కాదని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పొరపాటున అనడంతో చట్టసభల్లో అధికార పార్టీ సభ్యులు కులం పేరు ప్రస్తావిస్తూ స్పీకర్ వ్యక్తిత్వాన్ని, నైపుణ్యాన్ని తక్కువ చేసి మాట్లాడటం సరైంది కాదన్నారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

ఘట్‌కేసర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్ష కార్యదర్శులు సుందర్ రావు, శ్రీకాంత్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల బస్తీ దవాఖాన వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, పిజియోథెరపీ, అక్యూపంచర్ చికిత్సలు నిర్వహించారు.

వైభవంగా కుంభాభిషేకం

మేడ్చల్ ప్రతినిధి: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కుంభాభిషేకం, మహాసంప్రోక్షణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు ఎస్‌వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో శ్రీ రాఘవేంద్ర సేవాసమితి ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

విహారయాత్రలో విద్యార్థులు

బొంరాస్‌పేట: మండలంలోని ఏర్పుమళ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విహార యాత్రలతో విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలు సులభంగా అర్థమయ్యేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

సాగునీరు అందేలా చూస్తాం

యాలాల: రైతులకు చివరి పంట వరకు సాగునీరు అందేలా చూస్తామని చేవెళ్ల ఎంపీ బాలేశ్వర్ గుప్తా హామీ ఇచ్చారని యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా తెలిపారు. మండల పరిధిలోని జుంటుపల్లి ప్రాజెక్టును ఆదివారం బాలేశ్వర్‌గుప్తా రైతులతో కలిసి సందర్శించారు. ఆయన వెంట శివకుమార్, రాములు నాయక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పెన్సిల్స్ ప్యాకింగ్ పేరుతో సైబర్ మోసం

పెద్దేముల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు ఎన్నివిధాలుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఫలితంలేకుండా పోతోంది. తాజాగా మండలంలోని ఓ గ్రామంలో అలాంటి ఘటనే జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన యూనుస్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడి భార్య గృహిణి. ఆమె స్నాప్‌చాట్‌లో ఒక లింకును చూసింది. అందులో నటరాజ్ పెన్సిల్స్‌ను ఇంటివద్దనే ఉండి ప్యాకింగ్ చేసే పని ఉందని చెప్పారు. పెన్సిల్స్‌లోడ్‌తో బండి మీవద్దకు వస్తుంది. మీరు వాటిని కాటన్ డబ్బాల్లో ప్యాకింగ్ చేయాలి. నెలకు రూ.30వేల జీతం ఇస్తామన్నారు. రూ.15వేలు అడ్వాన్స్‌గా ఇస్తామని నమ్మబలికారు. అయితే అందుకోసం ముందుగా మీకు ఐడీకార్డు ఇవ్వడానికి రూ.650తో పాటు ఫోటో, ఆధార్‌కార్డు పంపించాలన్నారు. డబ్బులు పంపించగానే మీకు ఐడీకార్డు ఇస్తామని, వెంటనే పెన్సిల్స్ లోడ్‌కూడా పంపిస్తామన్నారు. దీంతో అదినమ్మిన యూనుస్ దంపతులు ఫోన్‌పేద్వారా ఆ డబ్బులు చెల్లించారు. వాట్సాప్‌లో ఫోటో, ఆధార్‌కార్డు పంపించారు. దీంతో మోసగాళ్లు వాట్సప్‌లో ఒక డూప్లికేట్ ఐడీకార్డు పంపించారు. ఆ తర్వాత లోడ్ రావడానికి ట్యాక్స్ పడుతుందని, మీరు రూ.3100 ఫోన్‌పే చేస్తే మీకు లోడ్ వస్తుందని చెప్పారు. వారి మాటలు నమ్మిన యూనుస్ తనవద్ద డబ్బులు లేకపోయినా ఇతరుల వద్ద నుంచి అప్పుగా తీసుకుని వారికి డబ్బులు చెల్లించాడు. అయినా లోడ్‌రాలేదు. పెన్సిల్స్ ఎప్పుడు వస్తాయని వాకబు చేసినా యూనుస్‌కు బండి తాండూరులోనే ఉందని, అయితే బండి కాస్త ఆలస్యమైనందుకు రూ.3150 చెల్లించాలని చెపుతున్నారని, బండిని వదలడం లేదని అన్నారు. మీరు ఆ డబ్బులు వేస్తే మీవద్దకు బండి వస్తుందని నమ్మకంగా చెప్పారు. ఇలా మొత్తం రూ.13వేలు చెల్లించారు. అయినా వారికి పెన్సిల్స్ రాకపోవడంతో ఆదంపతులు వారిని గట్టిగా నిలదీశారు. అందుకు వారు వినకపోగా మీరు రూ.లక్షా 50వేలు చెల్లించాలని, లేదంటే మీమీద కేసుపెడతామని బెదిరించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లుగా ఒక వీడియో పంపించారు. దీంతో బెదిరిపోయిన యూనుస్ దంపతులు శనివారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. జరిగిన విషయం పోలీసులకు వివరించి న్యాయం చేయాలని కోరారు. ప్రజలు ఇప్పటికైనా మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు పేర్కొంటున్నారు.

వాటర్ ట్యాంకులో పడి పంచాయతీ కార్మికుడి మృతి

తాండూరురూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకులో పడి పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామంలో జరిగింది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మప్ప(42) గ్రామపంచాయతీ కార్యాలయంలో మల్టీపర్పస్ కార్మికుడిగా గత 7సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాడు. హోలీ పండుగ సందర్భంగా తోటి కార్మికులతోపాటు గ్రామస్తులతో కలిసి పండుగలో పాల్గొన్నాడు. ఆ తర్వాత శనివారం ఉదయం పనికి వెళతానని ఇంట్లో చెప్పి వెళ్లిన లక్ష్మప్ప రాత్రయినా తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం లక్ష్మప్పను వెతుకుతుండగా, గ్రామంలోని బంగారమ్మ తాగునీటి ట్యాంకుపై లక్ష్మప్ప దుస్తులు కనిపించాయి. వెంటనే వెళ్లి చూడగా, వాటర్ ట్యాంకులో లక్ష్మప్ప మృతదేహం కనిపించింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ట్యాంకు వద్దకు చేరుకుని పరిశీలించారు. ప్రమాదవశాత్తు ట్యాంకులో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా వాటర్ ట్యాంకు నీళ్లు తాగిన కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

తాగుబోతు కొడుకు బారి నుంచి రక్షించండి

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు


వృద్ధురాలు మాణెమ్మ

ధారూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాగుబోతు కొడుకు దెబ్బలకు తాళలేక పోతున్నానని, తనను రక్షించాలంటూ ఓ వృద్ధురాలు ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. వృద్ధురాలు తన బాధను విలేకరులకు చెప్పుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దర్మాపూర్ గ్రామానికి చెందిన రాధి మాణెమ్మకు బందెయ్య మగ సంతానం. బందెయ్య మద్యానికి బానిసగా మారి తల్లి మాణెమ్మను తరుచూ దెబ్బలు కొడుతూ వేధిస్తుండేవాడు. మద్యం మత్తులో ఏ వస్తువు దొరికితే ఆ వస్తువుతో మాణెమ్మను కొట్టడం బందెయ్యకు అలవాటుగా మారింది. కొడుకు దెబ్బలకు తాళలేని మాణెమ్మ కూతురు వద్దకు వెళ్లి కాలం గుడుపుతున్నా, అక్కడికి కూడా వెళ్లిన బందెయ్య చెల్లెలిని తిట్టి తల్లిని తిరిగి ఇంటికి తీసుకువచ్చాడు. ఇదే క్రమంలో శనివారం రాత్రి తల్లిని బందెయ్య కర్రతో విచక్షణారహితంగా చితకబాదాడు. ఆ దెబ్బలకు తాళలేక వృద్ధురాలు ఆదివారం ధారూరు పోలీసులను ఆశ్రయించింది. శరీరంపై వాతలను చూపిస్తూ తన కొడుకు తనను చంపేస్తాడని, తాగుబోతు నుంచి కాపాడాలని వేడుకుంది. కాగా పోలీసులు బందెయ్య కోసం వెళ్లగా మద్యం మత్తులో ఉండటంతో పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పి వెనుదిరిగి వచ్చినట్లు తెలిసింది.

కారును ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కారును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరుశు రామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలం చెంగిచెర్లకు చెందిన సోలిపురం వెంకట్‌రెడ్డి ఆదివారం ఉదయం కారులో తన బంధువుల పిల్లలను రంగారెడ్డి జిల్లా బొంగుళూరులోని నారాయణ కాలేజ్‌లో దింపడానికి బయల్దేరాడు. ఈ క్రమంలో యంనంపేట్ చౌరస్తా వద్ద నిర్లక్ష్యంగా అతివేగంతో లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తాపడి శ్రీపాల్‌రెడ్డి, ఎండ్ల మనుశ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరించుకెళ్లారు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడ మక్తాలోని ధరావత్ మౌనిక, భర్త ధరావత్ నవీన్ తన ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటున్నారు. భర్త నవీన్ రోజువారీగా ఉద్యోగానికి వెళ్తుంటాడు. నవీన్ శనివారం డ్యూటీకి వెళ్లగానే భార్య మౌనిక తన పిల్లలను తీసుకొని మక్తాలోని కౌసల్యనగర్‌లో ఉండే తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. రాత్రికి తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం తీసిఉంది. లోపలికి వెళ్లిచూడగా అల్మారాలోని తులంన్నర బంగారు చైన్, తులంన్నర రెండు బంగారు ఉంగరాలు, 13 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.75వేల నగదును కనిపించలేదు. బాధితుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.